క్లుప్తంగా

28న జాబ్‌డ్రైవ్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో ఈనెల 28వ తేదీన జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ డ్రైవ్‌కు బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు సారథి 9347256400, రవీంద్రారెడ్డి 9390052901 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వలంటీర్‌కు అభినందన



వలంటీర్ అశోక్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ : దేశరాజధాని ఢిల్లీలో నిర్వహించిన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం. అశోక్ పాల్గొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిథ్యం వహించిన ఈయన ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాడు. ఈ సందర్భంగా గురువారం వలంటీర్ అశోక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల నాగరాజు, లీలావర్థిని, శివరామకృష్ణ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో ఉంటున్న అనాథలు, అభాగ్యులకు మెప్మా పీడీ సురేష్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సాయిరెడ్డి సహకారంతో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అందించిన దుప్పట్లు, టవళ్లను నిరాశ్రయులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కడప ట్రాఫిక్ సీఐగా జావేద్



కడప అర్బన్ : కడప నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా జావేద్ గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ట్రాఫిక్ సీఐగా పనిచేసిన సీతారామిరెడ్డిని కడప రిమ్స్ పీఎస్‌గా బదిలీ అయ్యారు. కడప ట్రాఫిక్ సీఐ జావేద్‌కు కడప ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : కడప నగరం బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓర్స్ బాలసుబ్బరాయుడు (36) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపిన వివరాల మేరకు సిద్దవటం మండలం వద్దవారిపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయుడు మోటార్ సైకిల్‌పై గురువారం కడపకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కిందపడి కాలికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

శాంతి ర్యాలీ

కడప కల్చరల్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వద్ద నుంచి 50 కార్లు, వ్యాన్లు, వైకుంఠ రథాలతో ర్యాలీని శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సంస్థ అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి శాంతికి చిహ్నమైన పావురాలను ఎగరవేశారు. ప్రజలంతా ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని, ఈ అంశం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టామన్నారు. అంతకు ముందు డైరెక్టర్ రాటాల గోపి, కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, డైరెక్టర్ సహదేవరెడ్డిలు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి, రాయచోటి చైర్మన్ శివగంగిరెడ్డి, వేంపల్లి చైర్మన్ చక్రపాణిరెడ్డి, రాజంపేట అధ్యక్షులు శ్రీనివాస నాయుడు, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యం, జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీసీని తొలగించాలని నిరసన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని తొలగించాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని పలు డిగ్రీ కళాశాలల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు మాట్లాడుతూ అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జి వీసీని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీ వైవీయూ పరిపాలన భవనాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్ ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా వీధుల్లో విద్యుత్ స్తంభాల నిర్వహణ సరిగా లేదు. అస్తవ్యస్తంగా విద్యుత్‌తీగలు ఉన్నాయి. కేబుల్ వైర్లు ఈ స్తంభాలకే చుట్టి ఉండడంతో గందరగోళం నెలకొంది. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు. మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– కడప కార్పొరేషన్




ఎన్‌జీవో కాలనీ వద్ద రోడ్డుపై వేలాడుతున్న కేబుల్ వైర్లు



చైతన్య కళాశాల వద్ద ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు



గౌస్ నగర్‌లో గజిబిజిగా ఉన్న వైర్లు



గంజికుంట కాలనీలో ..



ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



కలెక్టరేట్ వద్ద విద్యుత్ స్తంభాలకు, వైర్లకు అల్లుకుపోయిన తీగలు



మారుతీనగర్‌లో..

కృష్ణయ్య దుస్తులకు భలే గిరాకీ!



కృష్ణుని డ్రస్



నెమలి ఈక, పిల్లని గ్రోవి తదితర సామాగ్రి

కడప కల్చరల్ : మూడు రోజుల్లో శ్రీకృష్ణాష్టమి పండుగ రానుంది. ఈ సందర్భంగా మార్కెట్‌లో చిన్ని కృష్ణుని వేషం వేసేందుకు అవసరమైన దుస్తులు, ఇతర సరంజామకు మంచి డిమాండ్ ఏర్పడింది. తమ చిన్నారులను ముద్దులొలికే చిన్ని కృష్ణుని వేషంలో చూసుకుని మురిసిపోయేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా చిన్నికృష్ణుని దుస్తుల కోసం మార్కెట్‌లోని దుకాణాలలో కొనుగోళ్లు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో జిల్లా అంతటా కృష్ణాష్టమి పండుగను అత్యంత సందడిగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో ఈ పండుగ సందడిగా సాగుతోంది. ఈ సందర్భంగా చిన్నారులకు కృష్ణుని దుస్తులు అలంకరించడం ఆనవాయితీగా మారింది. పాఠశాలల్లో నర్సరీ నుంచి యూకేజీ వరకు చిన్నారులందరికీ ఈ పండుగనాడు కృష్ణయ్య దుస్తులను అలంకరిస్తారు. దీంతో జిల్లా మొత్తంపై దాదాపు 60 నుంచి 80 వేలకు పైగా కృష్ణుని దుస్తుల సెట్లు అమ్ముడవుతాయని వ్యాపారుల అంచనా. కేవలం దీనిపైనే జిల్లా అంతటా ఈ మూడు రోజుల్లో రూ. 3 కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రకరకాల దుస్తులు

మార్కెట్లలో ఈ సందర్భంగా విక్రయించేందు కోసం పలు రకాల డిజైన్లలో కృష్ణుని దుస్తులను తెప్పించి ఉంచారు. ప్రత్యేకించి తెల్లని, కాషాయ, పసుపు రంగు కృష్ణుని దుస్తులు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఇవి రూ. 200 నుంచి రూ. 750 ధరలో అందుబాటులో ఉన్నాయి. ఇవిగాక పూసలతో రూపొందించిన నెక్లెస్‌లు, లాంగ్‌చైన్‌లు, నెమలి ఈక, పిల్లని గ్రోవి (ఫ్లూట్) తదితరాలు గల సెట్ రూ. 200–600లకు పైగా సెట్‌లుగా విక్రయిస్తున్నారు. ఇళ్లలో కండువాలను చిన్నారులకు ధోవతిగా కట్టి ఇంటిలోని పూసల దండలు అలంకరించి వెదురు గొట్టాన్ని పిల్లన గ్రోవిగా ఇచ్చి కృష్ణుని వేషం వేయించేందుకు సిద్ధమైన తల్లిదండ్రులు నెమలి ఈకను మాత్రం దుకాణాల్లో కొనాల్సి వస్తోంది. ప్రత్యేకంగా ఒక్కొక్క నెమలి ఈక రూ. 10 లకు విక్రయిస్తున్నారు. తమ పిల్లలను చిన్ని కృష్ణునిగా కళ్లారా చూసుకుని మురిసిపోయేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇస్తున్నారు.

కదం తొక్కిన విద్యార్థిలోకం

- అమ్మాయిలపై అఘాయిత్యాలను అరికట్టాలి
- కోల్‌కతా ఘటనను నిరసిస్తూ శాంతిర్యాలీ
- కోటిరెడ్డి సర్కిల్‌లో మానవహారం



వైవీయూ : కోటిరెడ్డి సర్కిల్‌లో మానవహారం చేపట్టిన విద్యార్థినులు

వైవీయూ : అమ్మాయిలు, మహిళలపై తరచుగా జరుగుతున్న అఘాయిత్యాలను, అత్యాచారాలను అరికట్టాలంటూ మహిళాలోకం కదం తొక్కింది. గురువారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. వై.జంక్షన్ సర్కిల్ నుంచి విద్యార్థినులు ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సర్కిల్ మీదుగా కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకున్నారు. అనంతరం విద్యార్థినులు చేయిచేయి కలిపి కోల్‌కతా ఘటనను నిరసిస్తూ బాధిత కుటుంబానికి సంఘీభావంగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను మరింత కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.పి. మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. మస్తాన్‌బీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాదా కలందర్, కళాశాలల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో..



కడప కల్చరల్ : జేవీవీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప కల్చరల్ : కోల్‌కతాలో అత్యాచారానికి గురై ప్రాణాన్ని కోల్పోయిన జూనియర్ డాక్టర్ హత్యపట్ల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు తమ నిరసన వ్యక్తం చేశారు. గురువారం వారు నగరంలోని ప్రముఖ కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు సునీత, సరస్వతిలు మాట్లాడుతూ మహిళలపై దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని, సత్వర శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శన్ రెడ్డి సంఘీభావం తెలుపుతూ అత్యాచారాన్ని తీవ్రంగా ఖండించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర రాహుల్, కామేశ్వరమ్మ, మధుసూదన్, కాలేజి సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలపై విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన , ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో అవినీతికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. గురువారం కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి నోటిఫికేషన్, రోస్టర్ పద్ధతి పాటించకుండా యోగి వేమన, ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలను భర్తీ చేశారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు గంగాధర్, జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పలు విభాగాల తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి గురువారం సాయంత్రం పలు విభాగాలను తనిఖీ చేశారు. హాస్టల్ గదులను, వంటశాలలను పరిశీలించారు. అపరిశుభ్రతకు తావు ఇవ్వకూడదని అక్కడున్న సిబ్బందికి గట్టిగా సూచన చేశారు. అనంతరం ప్రవేశాల సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. ఈయన వెంట సైన్స్ విభాగ డీన్ ఆచార్య ఏజీ దాము, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఘనంగా ఆరాధనా మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్ర స్వామి బృందావనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి బృందావనానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో, వెండి కవచాలతో అలంకరించారు. అలాగే గోపాల కృష్ణునికి పంచామృతాభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. అనంతరం రాఘవేంద్రస్వామి మహిమలపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

జిల్లాలో ఈఎస్ఐ ఐపీ బ్లాక్ ఏర్పాటు చేయాలి



ఉదయభాస్కర్‌ను వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఈఎస్ఐ ఐపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు కోరారు. గురువారం ఈఎస్ఐ జిల్లా మేనేజర్ ఉదయభాస్కర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారికి అత్యవసర వైద్య సేవలు అవసరమైతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి వచ్చే వేతనం అంతంత మాత్రమేనని, వారి ఆరోగ్య సమస్యలు తీవ్రమైనపుడు డబ్బులు సరిపోక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందువల్ల జిల్లాలో ఐపీ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తే కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆప్కాస్ ఉపాధ్యక్షులు బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ హోమియో వైద్యులు

వల్లూరు : తగిన ముందస్తు జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని కమలాపురం ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల మెడికల్ ఆఫీసర్ షాకీర్ హుస్సేన్ తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, గురు, శని వారాల్లో కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో వున్న ప్రభుత్వ హోమియో వైద్యశాలలో అందుబాటులో వుండి వైద్య సేవలిందిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగ నిరోధక శక్తిని పెంపొందించి సీజనల్ వ్యాధుల నివారణకు గానూ 240 మంది విద్యార్థినులకు ఆర్సెనిక్ ఆల్బమ్ 200 మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నసీమున్నీసా పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ ట్రాక్టర్లు

వల్లూరు : మండలంలోని పాపాఘ్నినగర్ (కట్టబస్తాపు) వద్ద గురువారం తెల్లవారుజామున 10 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సంజీవ రాయుడు తెలిపారు. తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను లోడు చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం పట్టుబడిన ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లపై తదుపరి చర్యలకై రెవెన్యూ అధికారులకు నివేదించినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని పాపాఘ్ని, పెన్నా నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తపేట గ్రామసమీపంలోని పాపాఘ్నినది నుంచి గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎగువపల్లె క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని వాటిని సీజ్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ప్రయాణికులకు భద్రత కల్పించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత కల్పించాలని తిరుపతి రైల్వే డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హర్షిత గురువారం సాయంత్రం కడప రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత రికార్డులు, ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా హర్షిత మాట్లాడుతూ ముఖ్యంగా రైళ్లలో ఎలాంటి ప్రమాదకర వస్తువులు, నిషేధిత వస్తువులు రవాణా జరగకుండా చూడాలన్నారు. అలాగే ప్రయాణీకుల భద్రత విషయంగా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో మహిళా ప్రయాణీకుల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రయాణీకుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి మహిళా కానిస్టేబుల్ సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏ సమయంలో ఫిర్యాదులు వచ్చినా సత్వరమే స్పందించాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, జీఆర్‌పీ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరావు, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడపలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి



జేసీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గానుగపెంట హనుమంతరావు

కడప కల్చరల్ : జిల్లా కేంద్రమైన కడప నగరంలో తెలుగు తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం పక్షాన ఏర్పాటుకు కృషి చేయాలని తెలుగు భాష వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. గురువారం ఈ మేరకు జేసీ అదితిసింగ్‌ను ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా వ్యవహారిక ఉద్యమ కర్త గిడుగు రామమూర్తి పంతులు 161వ జయంతిని ప్రభుత్వం పక్షాన నిర్వహించాలన్నారు. అలాగే తెలుగుభాష సదస్సును కూడా ఏర్పాటు చేసి మాతృభాష తీయదనాన్ని తెలియచెప్పే విధంగా విద్యాసంస్థలలో ఈనెల 29న కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు తొలగించాలి



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. గురువారం ఓంశాంతి నగర్, శంకరాపురం, ఆగాడి, కాగితాలపెంట ప్రాంతాల్లో పర్యటించారు. ఓం శాంతినగర్‌లో, ఇంటర్‌నేషనల్ కళ్యాణ మండపం వద్దనున్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆక్రమించిన వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. కాగితాలపెంటలో నీటి సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదు అయినవారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : ఎఫ్ఐఆర్ నమోదు అయిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆర్‌జేడీ శ్యాముల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఆర్‌జేడీ రాఘవరెడ్డికిపై కడప డీఈఓ కార్యాలయం కేంద్రంగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో మరొక ఉపాధ్యాయుడిపై దాడి చేసిన సుండుపల్లె ఎంఈఓ వెంకటేష్ నాయక్, హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆదినారాయణ రెడ్డి, నాగమునిరెడ్డి, శివ కుమార్‌ల పై కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు. అయితే ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే సస్పెండ్ చేసి వారిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు సుమంత్ పాల్గొన్నారు.